

మొరాయించిన ఈవీఎం

మండలంలోని రాంపూర్‌తండా పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించి అరగంట పాటు ఓటింగ్ నిలిచిపోయింది. 9లో ▸



గజవాహనంపై స్వామి

అనంతగిరి గుట్ట అనంత పద్మనాభ స్వామి ఆలయంలో కార్తీక మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 9లో ▸

కేంద్ర బలగాల పహారాలో స్ట్రాంగ్ రూమ్‌లు

ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈవీఎంలను కేంద్ర బలగాల పహారాలో స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించాం. ఎన్నికల ఫలితాలు పూర్తయ్యే వరకూ రాచకొండ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి. – డీఎస్ చౌహాన్, రాచకొండ సీపీ



తాండూరులో ఓటు వేసిన మంత్రి మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



చేవెళ్ల మండలం కౌకుంట్లలో కుటుంబసభ్యులతో కలసి ఓటు వేసిన మంత్రి సబితారెడ్డి



ఓటు వేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి



ఓటు వేసిన ఎస్పీ కోటిరెడ్డి



అనంతగిరి: ఓటేసి సెల్ఫీ తీసుకుంటున్న అక్కాచెల్లెల్లు వైష్ణవి, సుష



పెద్దేముల్‌లో దివ్యాంగుడిని పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళుతున్న యువకుడు



రూప్‌ఖాన్‌పేట్‌లో స్టాండ్ సాయంతో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధురాలు



బంట్వారం: నాగవరంలో ఓటు హక్కు వినియోగించుకున్న ట్రాన్స్‌జెండర్



పెద్దేముల్‌లో ఓటు వేసేందుకు బారులు దీరిన మహిళలు

పోలింగ్@ 69.79%

జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య స్వల్ప ఘర్షణలు
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి

పోలింగ్ శాతం ఇలా..

జిల్లాలో సాయంత్రం 5గంటల వరకు 69.79శాతం పోలింగ్ నమోదైంది. పరిగి నియోజకవర్గంలో 69.34శాతం, తాండూరులో 71.02, కొడంగల్‌లో 70.5, వికారాబాద్‌లో 68.1శాతం పోలింగ్ నమోదైంది.

వికారాబాద్: జిల్లాలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. చిన్నచిన్న ఘటనలు మినహా పోలింగ్ శాంతియుత వాతావరణంలో జరిగినట్లు అధికారులు వెల్లడించారు. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించగా సిబ్బంది వాటిని సరి చేశారు. దీంతో కాస్త ఆలస్యంగా ఓటింగ్ ప్రారంభమైంది. పలు చోట్ల అధికార బీఆర్‌ఎస్ ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాటలు, స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పోలీసులు సత్వరం స్పందించడంతో పరిస్థితి చక్కబడింది. ఎన్నికల ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. తాండూరులో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. వికారాబాద్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి ఓటు వేశారు. జిల్లాలో సాయంత్రం 5 గంటల వరకు 69.79శాతం ఓటింగ్ నమోదైంది. సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ బూత్ ఉన్న వారందరికీ ఓటు వేసేందుకు అనుమతి ఇచ్చారు. పలుచోట్ల రాత్రి 7గంటల వరకు పోలింగ్ జరిగింది. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్‌లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సమస్యాత్మక కేంద్రాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్వల్ప ఘర్షణలు మినహా..

జిల్లాలో చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. బొంరాస్‌పేట మండలం రేగడి మైలారంలో బీఆర్‌ఎస్ – కాంగ్రెస్ వర్గాల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. తాండూరు మండలం సాయిపూర్‌లో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పరిగి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్ సమీపంలో డబ్బులు పంచుతున్నారంటూ కాంగ్రెస్ – బీఆర్‌ఎస్ ఆరోపణలు చేసుకోవటంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వారిని అక్కడి నుండి పంపించి వేశారు. వికారాబాద్‌లో అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీల నాయకుల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది.

మొరాయించిన ఈవీఎంలు

జిల్లాలోని పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్‌కు స్వల్ప అంతరాయం కలిగింది. బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల పోలింగ్ బూత్‌లో ఈవీఎం రెండు సార్లు మొరాయింటంతో అరగంట అంతరాయం కలిగింది. దోమ మండలం పాలపల్లి, మైలారం గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించటంతో వెంటనే మరమ్మతులు చేసి పోలింగ్‌ను ప్రారంభించారు.

వికారాబాద్‌లో పోలింగ్ ప్రశాంతం



మొయినాబాద్ మండలం ఎన్కెపల్లిలో ఓటు వేసిన ఎంపీ రంజిత్‌రెడ్డి దంపతులు



తాండూరు టౌన్: మొదటిసారి ఓటు వేసిన సుప్రియ

వికారాబాద్ అర్బన్: వికారాబాద్‌లో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. ఎక్కువ మంది ఉదయం ఓటు వేసేందుకు ఆసక్తి చూపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రసాద్‌కుమార్, బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగులు, వృద్ధులకు వీల్ చైర్లు సమకూర్చారు. అత్యధిక పోలింగ్ కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున మహిళలు బారులు తీరి ఓటు వేశారు. మున్సిపల్ పరిధిలోని కొత్తగడిలో సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు హైదరాబాద్, ఇతర నగరాల నుంచి ప్రజలు పల్లెలకు పోవడంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ కనిపించింది. గ్రామాల్లోకి వెళ్లడానికి బస్సులు పెద్దగా లేక పోవడంతో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించారు. ఎప్పుడు జనాలతో, వాహనాలతో రద్దీగా ఉండే కూరగాయల మార్కెట్, ఆలంపల్లి ప్రధాన రోడ్డు బోసిపోయి కనిపించింది. సాయంత్రం 5గంటల వరకు కూడా వ్యాపార సంస్థలు తెరుచుకోలేదు.

ఓటేసిన కలెక్టర్, ఎస్పీ

ఎన్నికల విధుల్లో ఎంతో బిజీగా ఉన్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డిలు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని సంఘం లక్ష్మీబాయి పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఇద్దరు అధికారులు ఓటు వేశారు. ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య గొడవ

మున్సిపల్ పరిధిలోని బీటీఎస్ కాలనీలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరు వర్గాలను పంపించేశారు.



అనంతగిరి: పోలింగ్ కేంద్రం నుంచి ఈవీఎంలను తెస్తున్న ఎన్నికల సిబ్బంది



అనంతగిరి: వికారాబాద్‌లో అధికారులకు ఈవీఎంలను అప్పగిస్తున్న ఎన్నికల సిబ్బంది



బొంరాస్‌పేట: తుంకిమెట్లలో ఈవీఎం మొరాయించడంతో రాత్రి 9గంటల తర్వాత కూడా వేచిచూస్తున్న ఓటర్లు



దౌల్తాబాద్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న జెడ్పీటీసీ దంపతులు



మర్పల్లి: పట్లూర్‌లో ఓటు వేసిన యువతులు



యాలాల: సంగెంకుర్దులో ఓటు వేసిన మహిళలు, యువతులు



ధారూరు: అల్లీపూర్‌లో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధుడు



మోమిన్‌పేటలోని ఏన్కతలలో ఓటు వేసిన యువకులు



అనంతగిరి: ధన్నారంలో..

క్లుప్తంగా

30వ తేదీ కోసం ఎదురు చూశా..



చాలా సంతోషంగా అనిపిస్తుంది. ఓటు హక్కు చాలా పవిత్రమైనది. ఆ హక్కుతోనే నచ్చిన నాయకున్ని ఎన్నుకునే అవకాశం దక్కింది. ఈ రోజు కోసమే చాలా రోజులుగా ఎదురు చూశాను. గతంలో ఓటు గురించి మాట్లాడుకునే వారం. ఇపుడు ఆ వరం నన్ను వరించింది.

– ప్రవీణ్‌, ధన్నారం, వికారాబాద్‌

సంతోషంగా ఉంది

మొదటి సారిగా ఓటు వేసినందుకు మాకు సంతోషంగా ఉంది. ఈ సారి పెద్ద ఎత్తున యువతకు ఓటు వచ్చింది. రాజ్యాంగం కల్పించిన హక్కుతో మంచి నాయకున్ని ఎన్నుకోవాలి. అప్పుడే దేశం, రాష్ట్రం బాగుపడుతుంది.

– వైష్ణవి, సుష్మ, పులుసుమామిడి

ఒకరికి బదులు మరొకరు ఓటు

ఫిర్యాదు చేసిన మహిళ



ఆధార్‌ కార్డు, ఓటరు స్లిప్‌ను చూపిస్తున్న బాలమణి

షాద్‌నగర్‌రూరల్‌: తన ఓటును వేరేవారెవరో వేశారని ఆరోపిస్తూ ఓ మహిళా ఓటరు ఎన్నికల అధికారులు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన షాద్‌నగర్‌ మున్సిపాలిటీ పరిధి చటాన్‌పల్లి పోలింగ్‌ కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బ్యాగరి బాలమణికి 162 పోలింగ్‌ కేంద్రంలో ఓటు హక్కు ఉంది. అదే గ్రామానికి చెందిన మరో మహిళ బాలమణికి 163 పోలింగ్‌ కేంద్రంలో ఓటు ఉంది. అయితే ఈ రెండు పోలింగ్‌ కేంద్రాలను అధికారులు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. 163 పోలింగ్‌ బూతులో ఓటు వేయాల్సిన బాలమణి.. 162లో వేసింది. 162 పోలింగ్‌ బూతులో ఓటు వేసేందుకు వచ్చిన బ్యాగరి బాలమణికి.. ఓటు హక్కు వినియోగించుకున్నావని అధికారులు చెప్పడంతో ఆశ్చర్యపోయింది. ఓటు వేసేందుకు అనుమతి ఇవ్వాలని ఆమె అధికారులను కోరింది. తన పేరు మీద ఉన్న ఓటును ఇతరులు వేయడం ఏమిటని ప్రశ్నించింది.

సాయంకాలం పోటెత్తిన ఓటర్లు

శంషాబాద్‌ : శంషాబాద్‌లో పోలింగ్‌ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో కలిపి 66.7 శాతం పోలింగ్‌ నమోదైంది. మొత్తం 87,256 ఓట్లకు 58,246 ఓట్లు పోలైనట్లు అధికారులు వెల్లడించారు. ఉదయం, సాయంత్రం ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్‌ కేంద్రాలకు వచ్చారు. మధ్యాహ్నం సమయం పోలింగ్‌ ప్రక్రియ బాగా నెమ్మదించింది. సాతంరాయి, గొల్లపల్లిలో ఈవీఎం యంత్రాలు మొరాయించాయి. ఎన్నికల ప్రక్రియను బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్‌ పరిశీలించారు. ఓటర్ల స్లిప్పులు పూర్తిగా అందకపోవడంతో ఓటువేయడానికి ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓటరు జాబితాలో ఓటులేని ఓటర్లు కూడా ఉసురుమంటూ తిరిగి వెళ్లిపోయారు.

నియోజకవర్గంలో 56.10 శాతం పోలింగ్‌

రాజేంద్రనగర్‌: నియోజకవర్గంలో గురువారం నిర్వహించిన పోలింగ్‌లో 56.10 శాతం పోలింగ్‌ నమోదైంది. శంషాబాద్‌, గండిపేట్‌, రాజేంద్రనగర్‌ మండల పరిధిలో 3,26,461 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇందులో 1,69,622 మంది పురుషులు కాగా.. 1,56,850 మంది మహిళలు, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు, సీనియర్‌ సిటిజన్లు 12 మంది, వికలాంగులు 15 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం మందకోడిగా ప్రారంభమైన పోలింగ్‌ 8 గంటల అనంతరం ఊపందుకుంది. ఉదయం 10 గంటలకు 18 శాతం పోలింగ్‌ నమోదు కాగా.. అనంతరం మందగించింది. మధ్యాహ్నం ఒంటిగంట అనంతరం ఓటర్లు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్‌ కేంద్రాలకు తరలి వచ్చారు. పోలింగ్‌ గంట ముందు పెద్దఎత్తున పోలింగ్‌ కేంద్రానికి రావడంతో పోలింగ్‌ శాతం పెరిగింది.



కొడంగల్‌లో ఓటు వేసిన కాంగ్రెస్‌ అభ్యర్థి, ఎంపీ రేవంత్‌రెడ్డి తదితరులు



దోమ: కుటుంబ సభ్యులతో ఓటు హక్కు వినియోగించుకున్న కాంగ్రెస్‌ పార్టీ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి టి. రామ్మోహన్‌ రెడ్డి



కొడంగల్‌: మీర్జాపూర్‌లో కుటుంబ సభ్యులతో ఓటి వేసిన బీఆర్‌ఎస్‌ అభ్యర్థి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

ఓట్ల పండుగ ప్రశాంతం

సాధారణ ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. వికారాబాద్‌, కొడంగల్‌, తాండూరు, పరిగి నియోజకవర్గాల పరిధిలో చిన్నచిన్న సంఘటనలు మినహా.. 69.79 శాతం పోలింగ్‌ నమోదై.. సుఖాంతంగా ముగిసింది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు బారులు తీరారు. వయసు, ఆరోగ్యం సహకరించకపోయినా.. పెద్దలు, దివ్యాంగులు తమ బాధ్యతను నెరవేర్చారు. కొత్తగా అర్హత పొందిన యువత ఓటు వేశారు. అనంతరం రెట్టింపు ఉత్సాహంతో తమ వేలికి ఉన్న సిరా గుర్తును చూపించి సంతోషం వ్యక్తంచేశారు.

– సాక్షి, నెట్‌వర్క్‌



పెద్దేముల్‌లో వరుసలో నిలబడిన ఓటర్లు



నవాబుపేట: చించల్‌పేటలో ఓటు వేసిన బీఆర్‌ఎస్‌ చేవెళ్ల అభ్యర్థి కాలె యాదయ్య తదితరులు



సతీసమేతంగా ఓటు వేసిన బీఆర్‌ఎస్‌ వికారాబాద్‌ అభ్యర్థి ఆనంద్‌



మర్పల్లి: కాంగ్రెస్‌ వికారాబాద్‌ అభ్యర్థి ప్రసాద్‌ కుమార్‌



ఓటేసిన బీజేపీ వికారాబాద్‌ అభ్యర్థి నవీన్‌కుమార్‌



తాండూరు: ఓటు హక్కు వినియోగించుకున్న కాంగ్రెస్‌ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి



పరిగి: ఓటు వేసిన బీఆర్‌ఎస్‌ పరిగి అభ్యర్థి, ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి దంపతులు



అనంతగిరి: ధన్నారం పోలింగ్‌ కేంద్రంలో బారులు మహిళలు



బొంరాస్‌పేట: పోలింగ్‌ కేంద్రం వద్ద బారులుదీరిన మహిళలు



బంట్వారం: కరీంపూర్‌లో ఓటర్లు



తాండూరు టౌన్‌: చంటి బిడ్డతో వచ్చి మహిళ



యాలాల: దేవనూరులో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు



తాండూరు టౌన్‌: తాండూరులో బీసీ కమిషన్‌ సభ్యుడు శుభప్రద్‌ పటేల్‌



కొడంగల్‌లో ఓటు వేసిన రేవంత్‌ సోదరుడు తిరుపతిరెడ్డి తదితరులు



ధారూరు: పోలింగ్‌బూత్‌లో క్యూలో నిలిచిన ఓటర్లు



బషీరాబాద్‌: కొర్విచెడ్‌లో బారులు తీరిన ఓటర్లు



పరిగి: సయ్యాద్‌పల్లిలో తొలిసారి ఓటు వేసిన యువకులు



బొంరాస్‌పేట: దుద్యాలలో..



బొంరాస్‌పేటలో..

ఓవర్‌ టు స్ట్రాంగ్‌ రూమ్స్‌

నగర కమిషనరేట్‌లో 15 చోట్ల ఏర్పాటు

- పటిష్ట భద్రత ఏర్పాటు చేసిన పోలీసులు
- కేంద్ర, రాష్ట్ర, నగర బలగాలతో పహారా

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల్లో తుది ఘట్టమైన కౌంటింగ్‌కు రెండు రోజుల గడువు ఉండటంతో పోలీసు బందోబస్తు డ్యూటీ స్ట్రాంగ్‌ రూమ్స్‌ వద్దకు మారింది. ఈవీఎం మిషన్లను గురువారం రాత్రికి వీటిల్లోకి తరలించి భద్రపరిచారు. నగర పరిధిలోని 15 చోట్ల స్ట్రాంగ్‌ రూమ్స్‌/కౌంటింగ్‌ కేంద్రాలు ఉన్నాయి. దీంతో ఆదివారం కౌంటింగ్‌ సైతం ఇక్కడే జరగనుంది. పోలింగ్‌ నేపథ్యంలో నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటన లేకుండా చర్యలు తీసుకున్న పోలీసులు స్ట్రాంగ్‌ రూమ్స్‌ వద్దా ఇలాంటి ఏర్పాట్లే చేస్తున్నారు. ప్రధానంగా మూడంచెల భద్రత కల్పించడంతో పాటు కొన్ని అదనపు చర్యలూ తీసుకుంటున్నారు. వీటిని నగర కొత్వాల్‌ సందీప్‌ శాండిల్య స్వయంగా పర్యవేక్షించారు.

స్ట్రాంగ్‌ రూమ్స్‌ భద్రతా ఏర్పాట్లిలా...

- స్ట్రాంగ్‌ రూమ్‌లకు కేవలం ఒకే ద్వారం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. రూమ్‌కు డబుల్‌ లాక్‌ సిస్టం ఏర్పాటు చేసి ఒకటి దాని ఇన్‌చార్జ్‌ వద్ద, మరోటి మేజిస్టీరియల్‌ అధికారాలున్న అధికారి వద్ద ఉంచారు.
- స్ట్రాంగ్‌ రూమ్స్‌ వద్ద 24 గంటలూ సాయుధ గార్డును ఉంచడంతో పాటు అనునిత్యం సీసీ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేశారు.
- స్ట్రాంగ్‌ రూమ్స్‌కు ఉండే మూడంచెల భద్రతలో తొలి అంచెలో (రూమ్‌ డోర్‌ దగ్గర) కేంద్ర సాయుధ బలగాలకు చెందిన వారు ఉంటున్నారు. దీనికోసం కనీసం ఒక సెక్షన్‌ (13 మంది) బలగాలు 24 గంటలూ అందుబాటులో ఉండేందుకు ఓ ప్లటూన్‌ (39 మంది) ప్రత్యేకంగా కేటాయించారు.
- రెండో అంచెలో రాష్ట్ర సాయుధ పోలీసులు, మూడో అంచెలో సాధారణ పోలీసు సాయుధ బలగాలను మోహరించారు.
- స్ట్రాంగ్‌ రూమ్స్‌ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఐసీసీసీలోని కమాండ్‌ అండ్‌ కంట్రోల్‌ సెంటర్‌కు (సీసీసీ) అనుసంధానించారు. అక్కడి దృశ్యాలను ఎప్పటికప్పుడు ఇక్కడి సిబ్బంది పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు.

నియోజకవర్గం	స్ట్రాంగ్‌రూమ్‌/కౌంటింగ్‌ కేంద్రం
ముషీరాబాద్‌	ఏవీ కాలేజ్‌, దోమలగూడ
మలక్‌పేట	అంబర్‌పేట ఇండోర్‌ స్టేడియం
జూబ్లీహిల్స్‌	కేవీబీఆర్‌ ఇండోర్‌ స్టేడియం, యూసుఫ్‌గూడ
సనత్‌నగర్‌	కాలేజ్‌ ఆఫ్‌ కామర్స్‌, ఓయూ
నాంపల్లి	ఫైన్‌ ఆర్ట్స్‌ కాలేజీ, మాసబ్‌ట్యాంక్‌
కార్వాన్‌	గవర్నమెంట్‌ పాలిటెక్నిక్‌, మాసబ్‌ట్యాంక్‌
గోషామహల్‌	కోఠి ఉమెన్స్‌ కాలేజ్‌
చార్మినార్‌	కమల నెహ్రూ పాలిటెక్నిక్‌, ఎగ్జిబిషన్‌ గ్రౌండ్స్‌
చాంద్రాయణగుట్ట	నిజాం కాలేజ్‌, బషీర్‌బాగ్‌
యాకుత్‌పురా	వనిత మహా విద్యాలయ, ఎగ్జిబిషన్‌ గ్రౌండ్స్‌
బహదూర్‌పురా	అరోరా లీగల్‌ సైన్సెస్‌ అకాడెమీ, బండ్లగూడ
సికింద్రాబాద్‌	పీజీఆర్‌ఆర్‌ సెంటర్‌ ఫర్‌ డిస్టెన్స్‌ ఎడ్యుకేషన్‌, ఓయూ
కంటోన్మెంట్‌	వెస్లీ కాలేజ్‌, సికింద్రాబాద్‌
ఖైరతాబాద్‌	కేవీబీఆర్‌ ఇండోర్‌ స్టేడియం, యూసుఫ్‌గూడ
అంబర్‌పేట	రెడ్డి ఉమెన్స్‌ కాలేజ్‌, నారాయణగూడ

గ్రామాల్లో మొరాయించిన ఈవీఎంలు

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్‌ చౌదరిగూడ మండలాల్లో పోలింగ్‌ ప్రశాంతంగా జరిగింది. చెదురు, మదురు ఘటనలు మినహా ఎక్కడ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. ఉదయం 7 నుంచి పోలింగ్‌ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. రాత్రి 7 గంటలు దాటినా ఓటర్లు వరుసలో నిల్చున్నారు. మధ్యాహ్నం 3 గంటల వరకు దాదాపు అన్ని కేంద్రాల్లో 60 శాతం పోలింగ్‌ దాటింది. కొందుర్గు మండలం, జిల్లేడ్‌ చౌదరిగూడ మండల పరిధి పలు గ్రామాల్లో పోలింగ్‌ 90 శాతం దాటింది. కాగా కొందరు తదితర ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించడంతో కొంతమేర అంతరాయం కలిగింది. దీంతో కొద్దిసేపు ఓటర్లు కేంద్రం ఆవరణలో కూర్చున్నారు.



ఈవీఎంలు మొరాయించడంతో కూర్చున్న మహిళలు